సారూ.. ఇదేమి తీరు

చెయ్యి నొప్పిగా ఉందంటే ఏకంగా చేతినే తీసేస్తే సరి అన్న వైద్యుడి చందంగా ఉంది ట్రాఫిక్ పోలీసుల తీరు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందన్న కారణంతో ఏకంగా రోడ్డునే మూసేశారు గాజువాక ట్రాఫిక్ పోలీసులు. ఈ చర్యపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి చర్యతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే అవకాశం ఉన్నప్పటికీ రోడ్డును మూసేయడం ఏంటా అని జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



సర్వీస్ రోడ్డును మూసివేసిన దృశ్యం

- క్రమబద్ధీకరణకు బదులు రోడ్డు మూసివేత
- ట్రాఫిక్ పోలీసుల తీరుపై కాలనీవాసుల అసంతృప్తి
- రోడ్డును వెంటనే తెరిపించాలని డిమాండ్

గాజువాక: శ్రీనగర్ జంక్షన్ నుంచి విశ్వేశ్వరయ్య రోడ్డుకు వెళ్లే మార్గంలో సర్వీస్ రోడ్డు మూసివేయడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. సర్వీస్ రోడ్డును తక్షణమే తెరిపించాలని కోరుతూ ఆ కాలనీకి చెందిన అసోసియేషన్ నాయకులు ఇటీవల పోలీసు అధికారులకు వినతిపత్రం ఇచ్చినా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.

ఇదీ సమస్య..

స్థానిక విశ్వేశ్వరయ్య నగర్ కాలనీ నుంచి జాతీయ రహదారిపైకి వచ్చేందుకు గతంలోనే సర్వీసు రోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ రోడ్డు శ్రీనగర్ జంక్షన్‌కు అనుసంధానమై ఉంటుంది. జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్‌లోకి ప్రవేశించకుండా సిమెంట్ స్టాపర్లు కూడా ఉన్నాయి. ఈ సర్వీస్ రోడ్‌లో విశ్వేశ్వరయ్య నగర్ కాలనీతో పాటు రెండు ఫంక్షన్ హాళ్లు, డీ మార్ట్ సూపర్ మార్కెట్ ఉన్నాయి. దరిమిలా సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగానే ఉంటుంది. శ్రీనగర్ జంక్షన్ వద్ద ఈ రోడ్డు అనుసంధానమై ఉండటంతో జంక్షన్‌లో ట్రాఫిక్ గందరగోళం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో సర్వీస్ రోడ్‌లో వన్‌వే ఏర్పాటు చేస్తే బాగుంటుందంటూ స్థానికులు ఎప్పటినుంచో కోరుతున్నారు. దీనిపై ఇప్పటివరకు స్పందించని ట్రాఫిక్ అధికారులు ఇప్పుడు అకస్మాత్తుగా కార్లు, ఆటోల రాకపోకలను నిలిపివేస్తూ సర్వీస్ రోడ్‌కు అడ్డుగా సిమెంట్ స్టాపర్లను ఏర్పాటు చేశారు. దీంతో కార్లు, ఆటోల్లో వెళ్లేవారు సర్వీస్ రోడ్ నుంచి జాతీయ రహదారిపైకి ప్రమాదకర పరిస్థితుల్లో వెళ్తున్నారు. ప్రమాదం జరిగితే భారీ నష్టం ఉంటుందని తెలిసినా సంబంధిత అధికారులు దానిపై స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. సర్వీస్ రోడ్‌లో వన్‌వే ట్రాఫిక్‌ను అనుమతిస్తే సమస్య సులువుగా పరిష్కారమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం సర్వీస్ రోడ్‌లో కార్లు, ఆటోలు వెళ్లకుండా చేయడం వల్ల స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సర్వీస్ రోడ్‌లో సిమెంట్ స్టాపర్లను వెంటనే తొలగించి వన్‌వేగా మార్చాలని కోరుతున్నారు.



ప్రమాదకర పరిస్థితుల్లో హైవే పైకి వెళ్తున్న కారు

కనీసం వన్ వే ఇవ్వాలి

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందన్న కారణంతో కార్లు,ఆటోలు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా స్టాపర్లు పెట్టేయడం సరికాదు. కనీసం వన్‌వే అయినా ఏర్పాటు చేసి వాహనాలను అనుమతించాలి. మా కాలనీ నుంచి హైవే పైకి వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే అధికారులకు తెలియజేశాం. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

– రామచంద్రరావు, విశ్వేశ్వరయ్య కాలనీ

నెల రోజుల్లో పరిష్కరిస్తాం

ప్రస్తుతం కార్లు, ఆటోలను ఆపాం. ద్విచక్ర వాహనాలకు ఇబ్బంది లేదు. ఈ సమస్యను పరిష్కరించే మార్గాన్ని పరిశీలిస్తున్నాం. హైవే పైకి కార్లు వెళ్లడం ఇబ్బందిగా ఉందన్న విషయాన్ని గుర్తించాం. త్వరలోనే శ్రీనగర్ జంక్షన్‌లో సిగ్నళ్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం. ఆ వెంటనే సర్వీస్ రోడ్‌ను వన్‌వేగా మార్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం. నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.

– కోటేశ్వరరావు, గాజువాక ట్రాఫిక్ సీఐ

ఆంధ్రుల సెంటిమెంట్‌తో ఆటలాడొద్దు

- రెచ్చగొడితే తిరుగుబాటు తప్పదు
- 'ఉక్కు' ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందే..
- ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్
- 1265వ రోజుకు రిలే దీక్షలు



మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

అగనంపూడి: విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదంతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైందని, ఆ సెంటిమెంట్‌తో ఆటలాడితే ప్రశాంతంగా ఉన్న ఆంధ్రులను రెచ్చగొట్టినట్టు భావించాల్సి వస్తుందని ఉక్కు ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్ష శిబిరంలో 1265వ రోజు, మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ పాత్ర చాలా ఉందని, అటువంటి విశాఖ ఉక్కును నష్టాల పేరుతో అమ్మాలని చూస్తే రాష్ట్ర ప్రజలు తిరుగుబాటు చేస్తారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించి, రూ.పది వేల కోట్ల నిధులను కేటాయించాలని కోరారు. పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు సెయిల్‌లో విలీనం కష్టమని ప్రకటించడం తగదన్నారు. శిబిరంలో ఇంటక్ ఎస్ఎంఎస్, ఆర్‌హెచ్ఎంపీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు, పి.వి.రమణమూర్తి, ధనుంజయ సాహు, పోతిరెడ్డి రాజేశ్వరరావు, కోరిబిల్లి అప్పారావు, గంగవరం గోపి, నాయుడు పాల్గొన్నారు.

టోల్‌గేటు టెండర్ రద్దుకు వినతి

అగనంపూడి: కార్పొరేషన్ పరిధిలో కొనసాగిస్తూ వచ్చిన అగనంపూడి టోల్‌ప్లాజా నిర్వహణ కోసం పిలిచిన టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్‌ను దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమితి సమన్వయకర్త బూసి వెంకటరావు కోరారు. నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వాస్తవంగా టెండర్ కాలపరిమితి ముగిసి, మూడేళ్లు పూర్తి అయిందని తెలిపారు. కాంట్రాక్టర్ లాభాలు రాలేదని ఒకసారి, అనకాపల్లి, పెందుర్తి జాతీయ రహదారి విస్తరణ పూర్తి అయ్యాక అక్కడి టోల్‌ప్లాజా తరలిస్తామని మరోసారి కోర్టును, అధికారులను తప్పుదోవ పట్టించి సదరు కాంట్రాక్టర్ అక్రమంగా దారి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న టోల్‌గేటును పునః ప్రారంభిస్తే స్థానికులు ఉపేక్షించరన్నారు. స్థానికుల మనోభీష్టానికి వ్యతిరేకంగా టోల్‌ప్లాజాను మళ్లీ ప్రారంభించాలని చూస్తే తిరుగుబాటు తప్పదని పేర్కొన్నారు. పీడీని కలిసిన వారిలో జాజి ఓంకార్, మందా శ్రీనివాస్, బోడపాటి శామ్యూల్ తదితరులున్నారు.



ఎన్‌హెచ్ఏఐ పీడీ ప్రభాత్‌రంజన్‌కు వినతిపత్రం అందిస్తున్న వెంకటరావు

పార్కింగ్ జోన్‌గా బస్ బే

- హైవేకు ఇరువైపులా ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు
- భారీ వాహనాల పార్కింగ్‌తో వాహనచోదకుల అవస్థలు

అగనంపూడి: జాతీయ రహదారిపై బస్టాప్‌లకు కొద్దిపాటి దూరంలో ఏర్పాటు చేసిన బస్‌బేలు భారీ వాహనాలకు పార్కింగ్ అడ్డాలుగా మారిపోతున్నాయి. అగనంపూడి సాయిబాబా గుడి, ఇ.మర్రిపాలెం బస్టాప్ కూడలి, లంకెలపాలెం జాతీయ రహదారి మరిడిమాంబ ఆలయం ఎదురుగా నిర్మించిన బస్‌బేలు భారీ వాహనాల పార్కింగ్ ప్రదేశాలుగా, గ్యారేజీలుగా మారిపోయాయి. సమీపంలోనే ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఉండడంతో వాహనాలు రెండు మూడు వరుసల్లో జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపివేస్తున్నారు. బస్‌బేలు ఉన్న చోట జాతీయ రహదారి కొద్దిగా కుదించుకుపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు ఓవర్‌టేక్ చేయబోతూ బస్‌బేల వద్ద ఉన్న డివైడర్లను ఢీకొడుతున్నాయి. గ్యారేజీలుగా మారడం వల్ల లారీ డ్రైవర్లు, క్లీనర్లు రోడ్లమీదే స్నానపానాలు, వంటా వార్పు చేస్తుండడంతో ఈ మార్గంలో వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందిగా మారుతోంది. అలాగే భారీ వాహనాల సిబ్బంది రోడ్లమీదే సేద తీరడం, డివైడర్లపై కునుకు తీస్తుండడం మరింత ఇబ్బందిగా తయారైంది. నిత్యం ఇదే తీరు కొనసాగుతుండడంతో రేయింబవళ్లు ఇక్కడ శబ్దాలు చేస్తుండడం కూడా ద్విచక్ర వాహన చోదకులను ఇక్కట్లకు గురి చేస్తోంది. అగనంపూడి సాయిబాబా గుడి వద్ద కూడా ఇదే పరిస్థితి ఉండడంతో పరిసర కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.



జాతీయ రహదారి ఇ.మర్రిపాలెం కూడలి వద్ద బస్‌బేలో నిలిపిన భారీ వాహనాలు

వాంబే కాలనీలో పూడికల తొలగింపు



వాంబే కాలనీలో పూడికలను తొలగింపజేస్తున్న ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని కాలువలు పూడుకుపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. మురుగు రోడ్ల పైకి రావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, దీనిపై సమాచారం అందుకున్న ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ సిబ్బందిని అప్రమత్తం చేసి ఆ కాలువల్లో పూడికలను దగ్గరుండి మంగళవారం తొలగింపజేశారు. అంతేకాకుండా అక్కడి పరిసరాలను శుభ్రం చేయించారు. అధికారులు సకాలంలో స్పందించి సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నిబంధనలకు నీళ్లు

అక్కిరెడ్డిపాలెం: నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. రోడ్డు పైకి చొచ్చుకువచ్చే విధంగా ఇష్టారాజ్యంగా ఎలివేషన్లు పెంచేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. రాజ్యం మనదే, ఇష్టారాజ్యంగా నిర్మించుకో అన్న విధంగా నిర్మాణాలు సాగుతున్నాయి. నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన సచివాలయ సిబ్బంది సైతం ఒత్తిళ్లతో చర్యలు చేపట్టలేక పోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ 69వ వార్డు చుక్కవానిపాలెంలో నిబంధనలకు విరుద్ధంగా కొన్ని మీటర్లు ముందుకు పొడిగించి అక్రమ నిర్మాణం చేపట్టారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం చూస్తూ ఉండిపోవడం విమర్శలకు తావిస్తోంది. వీరి కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



చుక్కవానిపాలెంలో ముందుకు చొచ్చుకువచ్చిన కట్టడం

ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్లాంట్‌లోని ఈడీ (వర్క్స్) భవనం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఆరు నెలలుగా ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదన్నారు. జీతం ఉద్యోగి హక్కని, ప్రతీ నెల 1న జీతం చెల్లించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. సగం జీతం చెల్లించడం వల్ల ఉద్యోగులు బ్యాంకులకు డిఫాల్ట్ అవుతున్నారన్నారు. ప్రతీ నెలా సుమారు 2 వేల కోట్ల టర్నోవర్ ఉండే ప్లాంట్‌లో కనీసం రూ. 86 కోట్లు సమకూరటం లేదని యాజమాన్యం నాటకాలాడుతోందని విమర్శించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఉద్యోగుల జీతాల నుంచి వసూలు చేసిన పీఎఫ్, త్రిఫ్ట్, ఎల్ఐసీలకు సకాలంలో చెల్లించక పోవడం దుర్మార్గమన్నారు. ఉద్యోగుల సొమ్మును పెట్టుబడిగా వినియోగించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. పీఎఫ్‌కు రూ. 250 కోట్లు, త్రిఫ్ట్‌కు రూ. 50 కోట్లు వడ్డీతో వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సీజీఎం(వర్క్స్)ఎ.కె.సోబ్తీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, టి.వి.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

మంత్రి సుభాష్ దృష్టికి కార్మిక సమస్యలు

ఉక్కునగరం: రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు కోరారు. మంగళవారం విశాఖ వచ్చిన రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అందుబాటులో తీసుకు రావాలని కోరారు. అంగన్‌వాడీ కార్మికులకు రిటైర్ అయిన తర్వాత గ్రాట్యుటీ, పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈపీఎస్–95 పెన్షన్‌దారులందరికీ ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని, ఫార్మాసిటీ కార్మికులకు శిక్షణ, సేఫ్టీ పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి లోవరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, జిల్లా కోశాధికారి లాలం ప్రసాద్, గాజువాక జోనల్ సెక్రటరీ రాందాసు నరేంద్ర, జిల్లా అధ్యక్షుడు రొక్కం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు



కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఉక్కు గేటు వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ సంఘం నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ మూడు గేట్ల వద్ద మంగళవారం ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. ఈఎస్ఐ లేని కార్మికులకు వైద్య సౌకర్యం యాజమాన్యమే కల్పించాలని కోరారు. ఎన్‌జేసీఎస్‌లో పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికుల తొలగింపు ఆలోచన విరమించుకోవాలన్నారు. ఈ అంశాలపై ఆగస్టు 5,6,7 తేదీల్లో అన్ని విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, యు.సోమేష్, సిహెచ్.నర్సింగరావు, మసేను తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారు సంఘాలకు ప్రోత్సాహం

మహారాణిపేట: రైతు ఉత్పత్తిదారు సంఘాల (ఎఫ్‌పీవో–ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)కు తగిన విధంగా ప్రోత్సాహం అందించాలని, ప్రొడక్ట్స్‌కు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర పథకాల ఫలాలను రైతులకు చేరువయ్యేలా అధికారులు కృషి చేయాలని నిర్దేశించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఎఫ్‌పీవో డిస్ట్రిక్ట్ లెవెల్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని వివిధ రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. రైతులు పండించే పంటలు, వాటి మార్కెటింగ్ అవకాశాలు, స్టోరేజ్ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారు సంఘాలకు అన్ని విధాలుగా సహకారం అందించాలని, వారికి ఆర్థిక ప్రయోజనాలు కలిగే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. సమావేశంలో నాబార్డ్ డెవలప్‌మెంట్ మేనేజర్ బసంత్ కుమార్, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులు, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి పాల్గొన్నారు.



ఉచిత ఇసుక పంపిణీ విధానం పక్కాగా అమలు కావాలి

మహారాణిపేట: జిల్లాలో అమలవుతున్న నూతన ఉచిత ఇసుక పంపిణీ విధానం పక్కాగా అమలు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పలువురు అధికారులతో కలిసి ఆయన ఇసుక డిపోలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతన ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో సజావుగా, సులభతరంగా ఇసుక పంపిణీ విధానం అమలుకావాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టి, స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలను పారదర్శకంగా అమలుచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, గనుల శాఖ ఉప సంచాలకులు డీఈ వీఎస్ ఎస్ఎన్.రాజు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక డిపో వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

నావికులకు ఘన వీడ్కోలు



అధికారులతో పదవీ విరమణ పొందిన నావికులు

సింథియా : తూర్పు నావికాదళ పరిధి ఐఎన్ఎస్ డేగాలో నిస్వార్థంగా సేవ చేసి పదవీ విరమణ పొందిన 63 మంది నావికులు, వారి కుటుంబాలకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలుకుతూ అభినందన సభ ఏర్పాటు చేశారు. కమాండింగ్ ఆఫీసర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన నావికుల సేవలను అధికారులు కొనియాడారు.

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నిత్యావసర సరకుల అందజేత



కొండలరావు కుటుంబానికి సరకులు అందజేస్తున్న ముత్యాల నాయుడు

అక్కిరెడ్డిపాలెం: అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వ్యక్తి కుటుంబానికి దాత సహకారం అందించారు. జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామానికి చెందిన కార్పెంటర్ పాలవలస కొండలరావు కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబం ఆర్థికంగా బాగా ఇబ్బంది పడుతుండటంతో నాతయ్యపాలేనికి చెందిన దాత కరణం ముత్యాలనాయుడు స్పందించారు. కొండలరావు కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు.

పోస్ట్ బడ్జెట్ ఆన్‌లైన్ కాన్ఫరెన్స్ వీక్షణ



ఆన్‌లైన్‌లో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలు

అక్కిరెడ్డిపాలెం: పీఎం మోదీ వికసిత్ భారత్ పోస్ట్ బడ్జెట్‌పై ఆన్‌లైన్ కార్యక్రమాన్ని స్థానిక పారిశ్రామికవేత్తలు ఆటోనగర్ వాసీవా భవనంలో వీక్షించారు. 2024–25 నేషనల్ కాన్ఫరెన్స్‌ను కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సహకారంతో ఆన్‌లైన్‌లో మంగళవారం నిర్వహించారు. కాన్ఫరెన్స్‌ను వీక్షించిన అనంతరం వాసీవా అధ్యక్షుడు పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ బడ్జెట్ సమావేశంలో పీఎం మోదీ ఇచ్చిన విశ్లేషణాత్మకమైన సందేశాలు పారిశ్రామిక వేత్తలకు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. బడ్జెట్‌లో పారిశ్రామికీరణకు కల్పించిన అవకాశాలను పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాసీవా ప్రతినిధులు, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన పల్లా



కమిషనర్‌కు మొక్క బహూకరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ నూతన కమిషనర్ పి. సంపత్‌కుమార్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో ఆయన్ను కలిసి, అభినందనలు తెలిపారు. గాజువాక నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్‌ను కోరారు.

తిరుపతిలో వెలమలకు ఓ కాటేజీ

దాబాగార్డెన్స్: వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లే తిరుమల వెళ్లే వెలమ కుల భక్తుల సౌకర్యార్థం వెలమ సంఘ నేతలు తిరుపతిలో వసతి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మించిన శ్రీశైలం, కాశీ పుణ్యక్షేత్రాల్లోని కాటేజీల తరహాలో తిరుపతిలో కూడా భవనాలు నిర్మించాలని ఆల్ వెలమ సంక్షేమ సంఘం ప్రతిపాదించింది. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సంఘ ప్రతినిధులు విశాఖ కేంద్ర సంఘం కార్యాలయంలో సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. తిరుపతి నుంచి వచ్చిన కర్రి సతీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల, నిధుల సేకరణకు రాష్ట్రంలోని వెలమ జాతీయులందర్నీ కలిసి సలహాలు, సూచనలు సేకరిస్తామన్నారు.